క్లుప్తంగా

తహసీల్ కార్యాలయం ముట్టడి

- పోడు భూములకు పట్టాలివ్వాలని రైతుల డిమాండ్



మాచారెడ్డి : పోడు భూములకు పట్టాలివ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ఎల్లంపేట గ్రామానికి చెందిన రైతులు తహసీల్ కార్యాలయాన్ని ముట్టడించారు.ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సయ్య మాట్లాడారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినట్లు పేద,మధ్య తరగతి రైతులకు పోడు భూములకు పట్టాలు అందజేయాలని డిమాండ్ చేశారు.అలాగే బ్యాంకు రుణాలు ఇప్పించాలన్నారు. అనంతరం తహశీల్దార్ శ్వేతకు మెమొరాండం అందజేశారు.కార్యక్రమంలో రైతులు,రైతుకూలీ సంఘం నాయకులు సుజాత,హీరమన్, ఆలీ,లక్ష్మీ రాములు కిష్టయ్య ఖాసీం ఉన్నారు.

ఆర్మీజవాన్లకు సన్మానం



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండలంలోని పలు గ్రామాలలో ఆర్మీ జవాన్లను బీజేపీ నాయకులు మంగళవారం సన్మానించారు. ఆపరేషన్ సిందూర్‌లో విధులను నిర్వర్తించి ఇటీవలే వారి స్వగ్రామమైన పోసాన్‌పల్లికి చెందిన పోతుగంటి సురేష్, హాజీపూర్ కట్టకింది తండాకు చెందిన మాలోత్ రంజిత్‌లను వారు శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నరేష్, శంకర్ ఉన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు పెన్షన్ అందించాలి



ఎల్లారెడ్డి: ప్రభుత్వం 50 ఏళ్లు పైబడిన భవన నిర్మాణ కార్మికులకు ప్రతి నెల రూ. 5వేల పెన్షన్ అందించాలని భవన నిర్మాణ కార్మికుల సంఘం నాయకులు అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డిలో నిర్వహించిన భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు కార్మిక వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని, ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలన్నారు. కార్యక్రమంలో లక్ష్మణ్, శ్యాం, సాయిబాబా తదితరులున్నారు.

రమాబాయి అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి



బాన్సువాడ రూరల్ : మండలంలోని బోర్లం గ్రామంలో మంగళవారం రమాబాయి అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా అంబేడ్కర్ యువజన సంఘం ప్రతినిధులు ఆమె త్యాగాలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు మన్నె అనిల్, మమ్మాయి లక్ష్మణ్, సాయి, శ్రీనివాస్, గంగారాం, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

రైతు గుర్తింపు కార్డు కోసం వివరాల సేకరణ



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండలంలోని రేపల్లెవాడలో వ్యవసాయ అధికారులు మంగళవారం రైతు గుర్తింపు కార్డునకు సంబంధించిన వివరాలను సేకరించారు. రైతులకు గుర్తింపు కార్డు అందించడంలో భాగంగా రైతులకు సంబంధించిన పట్టాపాసు పుస్తకంలోని భూమి వివరాలు, ఆధార్‌కార్డు, ఫోన్ నెంబర్ వివరాలను సేకరించినట్లు ఏఈవో రవీందర్ తెలిపారు. కార్యక్రమంలో రైతులు తదితరులున్నారు.

జీలుగ విత్తనాల పంపిణీ



పిట్లం(జుక్కల్) మండలం కేంద్రంలో, మండలంలోని తిమ్మనగర్ సొసైటీల్లో మంగళవారం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మారెడ్డి కృష్ణారెడ్డి, సొసైటీ చైర్మన్ సాయిరెడ్డిలు రైతులకు జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం సబ్సిడీపై అందించే జీలుగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, సహకార సంఘాలలో రైతుల కోసం జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు ప్రదీప్, లావణ్య, సీఈవో సంతోష్ రెడ్డి, సొసైటీ సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా హోర్డింగ్‌లు

- బాన్సువాడ బల్దియాలో అనుమతికి మించి.. అనధికారికంగా ఏర్పాటు
- చర్యలు తీసుకోవాలని ప్రజల వినతి



బాన్సువాడలో ఏర్పాటు చేసిన భారీ హోర్డింగ్

బాన్సువాడ : వివిధ కంపెనీలు, వ్యాపార సంస్థలు తమ ఉత్పత్తుల ప్రచారానికి భారీ హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలో బాన్సువాడ బల్దియలో నిబంధనలు విస్మరించి, అనుమతికి మించి భారీ స్థాయిలో రద్దీ ప్రాంతాలు, ప్రధాన రహదారి పక్కన ఉన్న భవనాలపై ఏర్పాటు చేస్తుండటంతో భారీ ఈదురుగాలులు, వర్షాల సమయాన కూలిపడతాయోననే ఆందోళన వ్యక్తమవుతోంది.

స్థానికుల్లో ఆందోళన...

బాన్సువాడ బల్దియా పరిధిలో 15 వరకు హోర్డింగ్‌లు ఉన్నట్లు అంచనా. అధికారికంగా మాత్రం 8 హోర్డింగ్‌లకే అనుమతి ఉంది. చాలా చోట్ల అనధికారికంగా హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తున్న పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. బాన్సువాడ–బోధన్ ప్రధాన రహదారికి ఇరువైపులా భవనాలపై భారీ హోర్డింగ్‌లు ఉన్నాయి. వీటిపై ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అలాంటివేవి పాటించకపోవడంతో ఫ్లెక్సీలు గాలికి చిరిగి వేలాడుతున్నాయి. ఫ్లెక్సీలు ఎగిరొచ్చి విద్యుత్ తీగలపై పడడంతో సరఫరాకు అవాంతరాలు ఎదురవుతున్నాయి. హోర్డింగ్‌లు పటిష్టంగా ఏర్పాటు చేయకపోవడంతో కూలిపడతాయేమోననే స్థానికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈవిషయమై మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజును సంప్రదించగా అనుమతి లేకుండా హోర్డింగ్‌లను ఏర్పాటు చేసిన భవన యజమానులకు నోటీసులు ఇస్తామని తెలిపారు.

నిబంధనలు గాలికి..

వ్యాపార, వాణిజ్య సంస్థల ప్రకటన కోసం ప్రైవేటు యాడ్ ఏజెన్సీలు మున్సిపాలిటీ నుంచి అనుమతి తీసుకుని హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తారు. అందుకోసం భవన బేస్‌మెంట్ పిల్లర్లతో అనుసంధానంగా పటిష్టంగా ఫిల్లర్ నిర్మించి రాడ్లు బిగించాలి. భవనాలపై హోర్డింగ్‌లు ఏర్పాటు చేశాక ఏటా పిల్లర్ల బలాన్ని పరిశీలించాలి. శిథిలావస్థకు చేరిన భవనాలు, పిల్లర్లపై హోర్డింగ్‌లు ఏర్పాటు చేయడంపై నిషేధం ఉంది. హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తే ఫెక్సీలు చినిగితే గాలిలో వేలాడకుండా తాళ్లతో బిగించాలి. సగం మేర చినిగినా, ముక్కలైనా వెంటనే తొలగించాల్సి ఉన్నప్పటికి నిబంధనలు ఎక్కడా అమలు కావడం లేదు. ఈ హోర్డింగ్‌ల ఏర్పాటుతో వచ్చే ఆదాయాన్ని చూస్తున్న అధికారులు జాగ్రత్తలను విస్మరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రతి ఇంటికి భగీరథ నీళ్లు అందేలా చూస్తాం

- మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు

బాన్సువాడ : బాన్సువాడ బల్దియా పరిధిలో ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నీళ్లు అందేలా చూస్తామని మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు అన్నారు. మంగళవారం ప్రచురితమైన 'భగీరథ కొందరికేనా'.. అనే కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. మున్సిపల్ కమిషనర్ పాత బాన్సువాడలో పైపులైన్ల మరమ్మతులు చేయించారు. మిషన్ భగీరథ నీళ్లు గూడెంగల్లీకి అందేలా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పట్టణంలో ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నీళ్లను సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. గూడెంగల్లీకి ఎందుకు మిషన్ భగీరథ పథకం ద్వారా ఎందుకు కుళాయిలు బిగించలేదో..పైపులైను ఎందుకు వేయలేదో తెలుసుకుంటానని అన్నారు. ఇంటింటికి మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. శిథిలావస్థలో ఉన్న ట్యాంకుల స్థానంలో అమృత్ పథకం ద్వారా కొత్త ట్యాంకులను నిర్మించనున్నట్లు తెలిపారు. చాల కాలంగా నెలకొన్న నీటి ఎద్దడిని తీర్చిన 'సాక్షి'కి కాలనీవాసులు ధన్యవాదాలు తెలిపారు.



పాత బాన్సువాడలో పైపులైను మరమ్మతులు చేయిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు

సాక్షి ఎఫెక్ట్..

పోచారం కాలనీలో మురికికాలువలు శుభ్రం

బాన్సువాడ : బీర్కూర్ మండల కేంద్రంలోని పోచారం కాలనీలో మురికికాలువను మంగళవారం ఎంపీడీవో మైబుబ్, పంచాయతీ కార్యదర్శి గంగాధర్ శుభ్రం చేయించారు. సాక్షిలో వచ్చిన 'అధ్వానంగా పోచారం కాలనీ' అనే కథనానికి బీర్కూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి గంగాధర్ స్పందించారు. పోచారం కాలనీలో మురికికాలువలను శుభ్రం చేయించారు. మురికికాలువల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. రోడ్డు పక్కన ఉన్న చెత్తచెదారంను కార్మికులతో శుభ్రం చేయించారు. కాలనీ వాసులు చెత్తను మురికికాలువల్లో వేయవద్దని, పంచాయతీ ట్రాక్టర్‌లోనే వేయాలని కార్యదర్శి సూచించారు. బీర్కూర్ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని వారు కోరారు.



మురికికాలువను శుభ్రం చేయిస్తున్న ఎంపీడీవో మైబుబ్, జీపీ కార్యదర్శి గంగాధర్

ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ యూనిట్‌కు నిధులు మంజూరు

దోమకొండ: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ యూనిట్‌కి అనుమతి లభించిందని మండల ప్రత్యేకాధికారి జ్యోతి, గడికోట ట్రస్టు మేనేజర్ బాబ్జీ అన్నారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ యూనిట్‌కు రూ.43 లక్షల మేర నిధులు మంజూరైనట్లు వివరించారు. ఇంటింటికి వ్యర్థాలను సేకరించే పనిని సులభతరం చేయడానికి విద్యుత్ సరఫరా మరియు రవాణా సదుపాయాల కోసం మరో రూ.20 లక్షలు కేటాయించబడ్డాయన్నారు. యూనిట్ నిర్వహణ బాధ్యతను గ్రామ పంచాయతీ, ఎంపీడీవో, ఐకేపీ గ్రామ సంఘాలు, మహిళా సంఘాలతో సమన్వయం చేస్తూ దోమకొండ గడికోట ట్రస్టును చూడవలసినదిగా కలెక్టర్ తెలియజేశారన్నారు. ప్రాజెక్ట్ అమలుపై చర్చించేందుకు ఒక సమావేశం నిర్వహించామన్నారు. పంచాయతీ ఇంజినీరింగ్ శాఖ యూనిట్ నిర్మాణాన్ని చేయవలసిందగా, విద్యుత్ శాఖ విద్యుత్ సౌకర్యాన్ని కల్పించడం, ఇందుకోసం దోమకొండ గడికోట ట్రస్టు తరపున రూ. 9.45 లక్షలను ఏర్పాటు చేయాలని, ఆటోలను చెత్త సేకరణకు ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ యూనిట్ యాజమాన్య నిర్వహణ పంచాయతీ, దోమకొండ ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహించాలని, సాంకేతిక సహాయాన్ని అందించాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ కోరారు. అదేవిధంగా సభ్యులను హైదరాబాద్ లోని చెత్త నిర్వహణా సంస్థలకు తీసుకొని వెళ్లి అందరికీ అవగాహన కల్పించాలని స్పెషల్ ఆఫీసర్ జ్యోతి సూచించారు. చెత్త సేకరణకు ప్రతి ఇంటి నుంచి నెలకు రూ. 30 చొప్పున సేకరించాలన్నారు. ఈవిషయంలో ప్రజలను చైతన్యం చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి యాదగిరి, ఐకేపీ ఏపీఎం రాజు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ట్రస్టు మేనేజర్ బాబ్జీ

విగ్రహావిష్కరణ విజయవంతం చేయాలి

బాన్సువాడ రూరల్: మండలంలోని కోనాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దళితనాయకులు మంగళవారం కోరారు. బుధవారం నిర్వహించే విగ్రహావిష్కరణ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, స్టేట్ ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజు హాజరు కానున్నారని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల అంబేడ్కర్ సంఘం నాయకులు, గ్రామస్తులు, దళిత బహుజనులు, ప్రజాస్వామికవాదులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమం జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దేశాయిపేట్ ప్రశాంత్, బంగారు మైసయ్య, నర్సింహులు, మన్నె సాయిలు, గైని గోపి, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.



కోనాపూర్‌లో మాట్లాడుతున్న దళితనాయకులు

అహిల్యాబాయి హోల్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

కామారెడ్డి అర్బన్ : కుటుంబాలే దేశానికి పట్టుగొమ్మలని, దేశం ఓ కుటుంబం అనే భావనతో ఉండాలని సామాజిక సమరసత వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్ అన్నారు. సామాజిక సమరసత వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో పట్టణ పరిధిలోని దేవీ విహార్ కమ్యూనిటీహాల్‌లో మంగళవారం అహిల్యాబాయి హోల్కర్ త్రి శతాబ్ది జయంతి ముగింపు సమావేశం నిర్వహించగా ముఖ్యవక్తగా అప్పల ప్రసాద్ హాజరై మాట్లాడారు. మూడు వందల ఏళ్ల క్రితం అహిల్యాబాయి హోల్కర్ మహిళల సాధికారత కోసం పనిచేశారని, ఆమెను ఆదర్శంగా తీసుకుని మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఈ సందర్భంగా మహిళలు, విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సామాజిక సమరసత వేదిక విభాగ్ సహ సంయోజక్ బాల్‌రాజ్‌గౌడ్, జిల్లా అధ్యక్షులు అమృత రాజేందర్, గౌరవ అధ్యక్షులు తుమ్మ రాంచంద్రం, మహిళా కన్వీనర్ అమృత రవళి, ప్రతినిధులు వజీర్ సుష్మా, కృష్ణమూర్తి, బాలకృష్ణ, రాజేంద్రప్రసాద్, నాగభూషణం, రవీందర్‌నాయక్, బాలయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అప్పాల ప్రసాద్

జిల్లాలో కురిసిన భారీ వర్షం



పిట్లంలో కురుస్తున్న వర్షం

పిట్లం/మద్నూర్(జుక్కల్): జిల్లా వ్యాప్తంగా, పిట్లం, మద్నూర్‌లల్లో మంగళవారం భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు, పలు కాలనీలు జలమయమయ్యాయి. వరి నాట్లు వేసుకోవడానికి వెసులుబాటు కలిగిందని రైతులు హర్షం వ్యక్తం చేశారు. దుక్కి దున్నడానికి వీలు పడుతుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



మాచారెడ్డిలో కురుస్తున్న వర్షం

మాచారెడ్డిలో భారీ వర్షంతో సాగని అంగడి

మాచారెడ్డి: మాచారెడ్డిలో కురిసిన భారీ వర్షంతో ప్రతి మంగళవారం సాగే కూరగాయల అంగడికి తీవ్ర అంతరాయం కలిగింది.దీంతో అంగడిలో వరద నీరు వచ్చి చేరడంతో రైతులు,వ్యాపారులు వినియోగ దారులు ఇబ్బంది పడ్డారు. చిరు వ్యాపారులు అదే వర్షంలో వెనుదిరిగి వెళ్లారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

- పలుచోట్ల ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన అధికారులు
- రైతులు రసీదు తీసుకోవాలని సూచన

బాన్సువాడ : నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డివిజన్ స్థాయి విత్తనాల తనిఖీ బృందం, ఏడీఏ అరుణ హెచ్చరించారు. మంగళవారం బాన్సువాడలో ఎరువులు, విత్తనాల దుకాణాలను ఏడీఏ, బాన్సువాడ రూరల్ సీఐ రాజేశ్, ఏవో మిస్బాఫైజుల్లాలతో కలిసి తనిఖీ చేశారు. దుకాణాల్లో ఉన్న విత్తనాలు, ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లను, స్టాక్ బోర్డులను పరిశీలించారు. రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె అన్నారు. అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు లైసెన్సులు ఉన్న విత్తనాల దుకాణాల్లోనే విత్తనాలను కొనుగోలు చేయాలని, విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు రసీదు తీసుకోవాలని ఆమె అన్నారు. నాసిరకమైన విత్తనాలు అమ్మితే లైసెన్స్‌లు రద్దు చేసి, కేసులు నమోదు చేస్తామని అన్నారు.



బాన్సువాడలో విత్తనాలను పరిశీలిస్తున్న ఏడీఏ అరుణ, రూరల్ సీఐ రాజేష్

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని విత్తనాల దుకాణాలు, ఫర్టిలైజర్ దుకాణాలను విత్తనాల తనిఖీ బృందం అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్లను పరిశీలించి రైతులకు నాసిరకం ఎరువులు ఇవ్వకూడదని ఆదేశించారు. కార్యక్రమంలో గాంధారి ఏవో రాజలింగం, ఎల్లారెడ్డి ఏవో నదీమ్,నస్రుల్లాబాద్ వ్యవసాయ శాఖ అధికారిణి భవాని ఉన్నారు.

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను మంగళవారం వ్యవసాయ శాఖ ఏడీఏ రత్న ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా దుకాణ నిర్వహకులతో ఆమె మాట్లాడుతూ...రైతులకు నకిలీ విత్తనాలను అంటగడితే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఏవో ప్రజాపతి, దుకాణ నిర్వహకులు పాల్గొన్నారు.

రాజంపేట : మండలంలోని పలు విత్తన దుకాణాలను మండల వ్యవసాయాధికారిణి శృతి తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్స్‌ను ఆమె పరిశీలించారు. డీలర్లు తెచ్చుకున్న విత్తన స్టాక్స్ ఎప్పటికప్పుడు రిజిస్టర్స్‌లో నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు.

నకిలీవిత్తనాలు అమ్మితే క్రిమినల్ కేసులు

బిచ్కుంద(జుక్కల్) : నకిలీ విత్తనాలు అమ్మితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఏడీఏ అమినాబీ, ఎస్సై మోహన్‌రెడ్డి హెచ్చరించారు. బిచ్కుందలో విత్తనాలు, ఎరువుల దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. నిబంధనలు పాటించి ఎరువులు, విత్తనాలు విక్రయించాలని డీఏపీ కొరత ఉందని తెలిసిందన్నారు. స్టాక్ అందుబాటులో ఉంచాలని డీలర్లకు సూచించారు. ఏవో అమర్ ప్రసాద్ ఉన్నారు.



నస్రుల్లాబాద్‌లో..



రాజంపేటలో .. వ్యవసాయాధికారిణి శృతి



బిచ్కుందలో విత్తనాలు పరిశీలిస్తున్న అధికారులు

మలిదశ ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా గంగాధర్



బాన్సువాడ : తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఉడుత గంగాధర్‌ను నియమితులయ్యారు. ఈ నెల 25న హైదరాబాద్‌లోని సోమాజిగూడలో జరిగిన ఉద్యమకారుల రౌండ్‌టెబుల్ సమావేశంలో కామారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా గంగాధర్‌ను నియమిస్తున్నట్లు రాష్ట్ర చైర్మన్ చీమ శ్రీనివాస్ ప్రకటించారు. ఈసందర్భంగా గంగాధర్‌ను మంగళవారం బాన్సువాడలో మలిదశ ఉద్యమకారులు ఘనంగా సన్మానించారు. మలిదశ ఉద్యమకారుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని గంగాధర్ అన్నారు. గంగాధర్‌దేశాయ్, చందు, భాస్కర్‌గౌడ్, కృష్ణ, దత్తు, ఎర్రవాటి సాయిబాబా, మాజీద్, పవన్, సాయికుమార్, గంగారం, నగేష్, మహేష్, వెంకటి తదితరులున్నారు.

రేపు కాంగ్రెస్ పార్టీ సమావేశం

కామారెడ్డి అర్బన్: కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని గురువారం నిర్వహించనున్నారు. సిరిసిల్ల రోడ్డులోని కింగ్స్ కన్వెన్షన్‌లో ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ పాల్గొనే సమావేశాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులను కోరారు.

వైభవంగా రేణుకామాత జమదగ్నిల కల్యాణం

కామారెడ్డి రూరల్ : మండలంలోని ఇస్రోజీవాడి గ్రామంలో మంగళవారం శ్రీ రేణుకామాత జమదగ్నిల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు కుంకుమార్చన చేశారు. సాయంత్రం ఇంటికో బోనం చొప్పున గ్రామస్తులందరు కలిసి బోనాలను ఊరేగించి అమ్మవారికి సమర్పించారు. రేణుకామాత కల్యాణానికి రాష్ట్ర బీఆర్ఎస్ యువ నాయకుడు గంప శశాంక్ హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు పద్మారెడ్డి, కోశాధికారి మల్లేష్, మాజీ సర్పంచ్ కొత్త మమత రాజు, స్వామి, బాలమల్లు, మల్లేష్, రవీందర్‌రెడ్డి, గాండ్ల శ్రీను, రాజమల్లు, కమిటీ సభ్యులు, మొగుళ్ల సాయాగౌడ్, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.



నేడు నస్రుల్లాబాద్‌లో తిరంగా ర్యాలీ

నస్రుల్లాబాద్ : మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం 5.గం.లకు తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు బీజేపీ పార్టీ మాజీ అధ్యక్షులు సున్నం సాయిలు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో ఆర్మీ జవాన్లకు సాంఘీభావంగా ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. మండల వ్యాప్తంగా ఉన్న యువకులు, నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరు హాజరవ్వాలని ఆయన కోరారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): విద్యార్థినులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని మండలంలోని మర్కల్ స్టేజీ వద్ద గల మహిళ గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...గురుకుల కళాశాలల్లో చదువుతున్న, చదువు పూర్తి చేసుకున్న విద్యార్థినులు నైపుణ్య శిక్షణను వినియోగించుకోవాలన్నారు.

165 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 90 గంటలు తరగతి గదిలో, 75 గంటలు సెల్ఫ్ లర్నింగ్ విధానంలో శిక్షణ ఇవ్వన్నుట్లు వివరించారు. టెన్త్, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ పూర్తి చేసిన వారు, డిగ్రీ ఫైనలీయర్ చదువుతున్న వారితో పాటు పూర్వ విద్యార్థులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పంటల్లో యాజమాన్య పద్ధతులు పాటించాలి

బీబీపేట : వర్షాకాలం సీజన్‌లో వేసే పంటలకు యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతునేస్తం ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలతో రైతులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యాసంగి సీజన్‌లో వరికొయ్యలను కాలిస్తే నష్టం వాటిల్లుతుందని తెలిపారు. అలాగే పచ్చిరొట్ట ఎరువుల వాడకంతో కలిగే లాభాలు, విత్తన కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అధిక మోతాదులో యూరియా వాడకంతో కలిగే నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ అపర్ణ, ఏవో నరేందర్, ఏఈవో రాఘవేంద్ర, సంతోష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

మద్నూర్(జుక్కల్): మండలంలోని మేనూర్ వద్ద రహదారిపై మంగళవారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడుపుతున్న వారికి జరిమానాలు విధించారు. బైక్‌లపై ఇద్దరి కంటే ఎక్కవ మంది ప్రయాణిస్తున్న వారికి హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు.